విలేకరులు కావలెను
తెలంగాణ వాణి
TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143



TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 121 | ఆదివారం 30. 8. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


## ల్యాండింగ్‌లో పేలిన టైర్

- త్రుటిలో తప్పిన ముప్పు
- ఢిల్లీ-బిలాస్‌పూర్ అలయన్స్ విమానంలో ఘటన
- 37 మంది ప్రయాణికులు సహా 41 మంది సురక్షితం



## సోనియా ఆత్మకథపై 'ప్రచురణ' రగడ

- 'బిలాంగింగ్'కు తాము ప్రచురణకర్తలం కాదన్న పెంగ్విన్ ఇండియా
- మోదీ, ఆర్‌ఎస్‌ఎస్, భారత్-చైనా అంశాల్లో మార్పులు కోరారంటూ కాంగ్రెస్ ఆరోపణ
- సంపాదకీయ మార్పుల వివాదంపై ప్రచురణ సంస్థ వివరణ




## నేపాల్ వరదల్లో 1,400 మందికి పైగా గల్లంతు



- గల్లంతైన వారి జాబితాను విడుదల చేసిన నేపాల్ పోలీసులు
- 178 మంది భారతీయులు సహా 644 మంది వివరాల వెల్లడి
- సుమారు 320 మంది భారతీయుల ఆచూకీ లేదన్న విదేశాంగ శాఖ

# సర్‌పై అభ్యంతరాలు.. గడువు పొడిగించాలి

## తెలంగాణ ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి

- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు సీఎం లేఖ
- అక్టోబర్ 19తో గడువు ముగుస్తున్నందున మరో 4 వారాలు పెంచాలి
- సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున గడువు పెంచాలి
- 'సర్'కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోంది
- ఓటర్ల పరిశీలనలో అనేక లోపాలు ఉన్నాయని, నోటీసు ఇవ్వకుండా ఓట్లు తొలగించవద్దు
- గ్రామ, వార్డు సభల్లో ముసాయిదా ఓటర్ జాబితాను కనీసం రెండుసార్లు చదివి వినిపించాలి
- నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు 4 వారాల గడువు ఇవ్వాలి
- పట్టణాల్లో పోలింగ్ కేంద్రాల వారీగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలి
- మండలస్థాయి అధికారులు ఇచ్చే డాక్యుమెంట్‌నూ ఆమోదించాలి



# క్యాబినెట్, ప్రభుత్వంలో మార్పు రావాలి

## శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

- క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ చేస్తే కొత్తదనం వస్తుంది
- "ఏ పార్టీలోనూ క్రమశిక్షణ లేదు.
- కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ తగాదాలు తగ్గించాల్సిన అవసరం ఉంది
- సీనియర్ నేత చిన్నారెడ్డి పార్టీ లైన్ దాటి మాట్లాడటం సరికాదు.
- గీత దాటిన వారిపై వేటు వేయకపోతే పార్టీకే నష్టం.
- ప్రభుత్వం, పార్టీలో లీకేజీలు కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉంది.
- ఇప్పుడిస్తున్న పింఛన్లను రూ.3 వేలకు పెంచాలి.
- 22ఏను రద్దు చేసి సమస్యలను పరిష్కరించాలి.
- ఉచితాలు క్రమంగా తగ్గించాలి.
- ప్రస్తుతం సామాన్యుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత లేదు.
- మీడియాతో చిట్‌చాట్‌లో కీలక వ్యాఖ్యలు



# దివ్యాంగులపై దయ లేని ప్రభుత్వం కూడా ఒక ప్రభుత్వమేనా?

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు
- బీఆర్ఎస్ హయాంలో దివ్యాంగుల పెన్షన్ ను రూ.500 నుంచి రూ.4016కు పెంచిన ఘనత కేసీఆర్‌దే..
- హౌసింగ్ లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ ఇచ్చారు.
- విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే..
- కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. సీఎం రేవంత్ దివ్యాంగుల పెన్షన్ ను ఒక్కరూపాయి అయినా పెంచాడా?
- దివ్యాంగుల సమస్యలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని నిలదీస్తుంది
- రేవంత్ రెడ్డి నోరు తెరిస్తే.. చంద్రబాబు తన గురువు, ఏపీ తన ఆదర్శమని అంటాడు
- తన గురువు ఏపీలో దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు పెన్షన్ ఇస్తున్నాడు

**హైదరాబాద్ తెలంగాణ వాణి)**
దివ్యాంగులపై దయ లేని ప్రభుత్వం కూడా ఒక ప్రభుత్వమేనా? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు నిలదీశారు. ఎల్‌బినగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. బీఆర్ఎస్ హయాంలో దివ్యాంగుల పెన్షన్ ను రూ.500 నుంచి రూ.4016కు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అలాగే హౌసింగ్ లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ ఇచ్చారని, విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమని గుర్తుచేశారు. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. సీఎం రేవంత్ దివ్యాంగుల పెన్షన్ ను ఒక్కరూపాయి అయినా పెంచాడా? అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా.. తెలంగాణలో దివ్యాంగుల చట్టాన్ని అద్భుతంగా అమలు చేసి.. భారత్‌లోనే ఉత్తమ రాష్ట్రంగా అవార్డు పొందేలా చేసింది కేసీఆర్ అని కితాబిచ్చారు. దివ్యాంగుల సమస్యలపై అసెంబ్లీలో



బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని నిలదీస్తుందని హరీష్ రావు హామీ ఇచ్చారు. అలాగే దివ్యాంగులు కోరిన విధంగా కేసీఆర్ తో సంప్రదించి.. బీఆర్ఎస్ పార్టీలో దివ్యాంగుల శాఖను కూడా ఏర్పాటు చేసి.. దివ్యాంగులను పార్టీలో భాగస్వామ్యం చేసుకుంటామన్నారు.

# ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ

**హైదరాబాద్ తెలంగాణ వాణి)**
తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు (కేకే) నేతృత్వంలోని కమిటీ ప్రతినిధి బృందం శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కలిసి ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మోతె శోబన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ పాల్గొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వేదికగా నిర్వహించిన విస్తృత



స్థాయి సంప్రదింపుల వివరాలను కమిటీ ముఖ్యమంత్రికి వివరించింది. ఈ సంప్రదింపుల్లో 13 వేల మందికి పైగా తెలంగాణ ఉద్యమకారులతో పాటు వివిధ జేఏసీలు, ప్రజాసంఘాలు, కవులు, కళాకారులు, మహిళా ఉద్యమకారులు పాల్గొన్నట్లు కమిటీ తెలిపింది. ఉద్యమకారుల నుంచి సేకరించిన అభిప్రాయాలు, విజ్ఞప్తులతో పాటు ఉద్యమకారుల వర్గీకరణకు సంబంధించిన ముసాయిదా నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను గుర్తిస్తూ వారి సేవలకు తగిన గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు కమిటీ వెల్లడించింది. ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమానికి సంబంధించిన కసరత్తును ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ కోసం అధికారిక వెబ్‌సైట్, పోర్టల్ ఏర్పాటు, డిజిటల్ దరఖాస్తుల స్వీకరణ, జిల్లాల వారీగా సమన్వయం, అవసరమైన పరిపాలనా వనరుల కల్పన వంటి అంశాల్లో కమిటీకి పూర్తి సహకారం అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు

- పన్నుల భారంతో సామాన్యుడి సతమతం
- పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు వస్తువులపై పన్నుల ప్రభావం
- ఉపాధి అవకాశాల కొరతతో పెరుగుతున్న ఆర్థిక ఇబ్బందులు

**హైదరాబాద్ ఆగస్టు 29 (తెలంగాణ వాణి స్పెషల్ కరస్పాండెంట్ టి.ఎన్. రమేష్)**
నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో పాటు పన్నుల భారం సామాన్య ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సబ్బులు, ఉప్పు, పప్పులు, వంటనూనె, చక్కెర వంటి నిత్యావసర సరుకుల నుంచి దుస్తులు, వాహనాలు తదితర వస్తువుల వరకు ధరలు పెరుగుతుండటంతో కుటుంబ బడ్జెట్‌పై భారం పడుతోందని ప్రజలు వాపోతున్నారు. మరోవైపు పెట్రోల్, డీజిల్ ధరలు రవాణా రంగంపై ప్రభావం చూపుతున్నాయని వ్యాపారులు, రవాణా రంగానికి చెందిన వారు చెబుతున్నారు. ఇంధన వ్యయాలు పెరగడంతోఫ్ రవాణా ఖర్చులు పెరిగి, ఆ ప్రభావం చివరకు వివిధ వస్తువుల ధరలపై పడుతోందని వారు పేర్కొంటున్నారు.

### పన్నుల భారం.. సామాన్యుడిపై ప్రభావం

దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చిన తర్వాత అనేక పరోక్ష పన్నుల వ్యవస్థను ఏకీకృతం చేసినప్పటికీ, వివిధ వస్తువులు, సేవలకు వేర్వేరు పన్ను శ్లాబులు కొనసాగుతున్నాయి. మరోవైపు పెట్రోలియం ఉత్పత్తులపై జీఎస్టీ కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు, సుంకాలు అమల్లో ఉండటం కూడా ధరలపై ప్రభావం చూపుతోంది. వస్తువుల ధరల్లో పన్నుల వాటా, ఉత్పత్తి వ్యయం, రవాణా ఖర్చులు, ముడిసరుకు ధరలు వంటి అనేక అంశాలు ఉంటాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అయితే పన్నుల విధానం సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అధిక భారంగా మారకుండా ప్రభుత్వం సమీక్షించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### ఉపాధి లేక.. పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడి

ధరల పెరుగుదలకు అనుగుణంగా ఆదాయాలు పెరగకపోవడం మరో ప్రధాన సమస్యగా మారిందని ప్రజలు అంటున్నారు. విద్యార్హతలు ఉన్నప్పటికీ తగిన ఉద్యోగాలు లభించక అనేక మంది యువత చిన్నచిన్న వ్యాపారాలు, కూలి పనులు, స్వయం ఉపాధిపై ఆధారపడుతున్న పరిస్థితి ఉందని పలువురు పేర్కొంటున్నారు. కార్మికులు, రైతులు, రైతు కూలీలు, చిరు వ్యాపారులు రోజువారీ ఖర్చులను అధిగమించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నప్పటికీ, పెరుగుతున్న ధరలు వారి ఆదాయంపై ఒత్తిడి పెంచుతున్నాయని సామాజికవేత్తలు అంటున్నారు. ఉపాధి అవకాశాల పెంపు, ఆదాయ భద్రత, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు.

### పన్నుల చరిత్రపై చర్చ

భారతదేశంలో పన్నుల వ్యవస్థకు సుదీర్ఘ చరిత్ర ఉంది. బ్రిటిష్ పాలనలో వివిధ రకాల పన్నులు, సుంకాలు విధించబడిన విషయం చారిత్రకంగా తెలిసిందే. స్వాతంత్ర్యం అనంతరం దేశ ఆర్థికాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక వసతుల కోసం పన్నుల వ్యవస్థ కొనసాగుతూ వచ్చింది. కాలానుగుణంగా పన్నుల విధానంలో అనేక సంస్కరణలు చోటు చేసుకున్నాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో పన్నుల వసూళ్లు, ప్రభుత్వ వ్యయం, సంక్షేమ పథకాలు, ప్రజలపై పడుతున్న ఆర్థిక భారంపై విస్తృత చర్చ అవసరమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

### ప్రజల జీవన ప్రమాణాలపై దృష్టి అవసరం

ఒకవైపు ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు, రాయితీలు అందిస్తుండగా.. మరోవైపు ప్రజల ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ధరల నియంత్రణ, ఉపాధి కల్పన, వ్యవసాయరంగానికి మద్దతు, చిన్న వ్యాపారాలకు ప్రోత్సాహం, పన్నుల విధానంలో పారదర్శకత వంటి అంశాలపై ప్రభుత్వాలు సమగ్ర విధానాలు



రూపొందించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల నుంచి వసూలు చేసే పన్నులు తిరిగి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఉపయోగపడేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సామాజిక, ఆర్థిక వర్గాలు సూచిస్తున్నాయి. పెరుగుతున్న ధరలు, ఉపాధి సమస్యలు, పన్నుల భారాన్ని సమగ్రంగా పరిష్కరించినప్పుడే సామాన్య ప్రజలకు నిజమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందని వారు పేర్కొంటున్నారు.

## అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి: మంత్రి తుమ్మల



**ఖమ్మం, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్‌లో సుడా నిధులు రూ.95.50 లక్షలతో చేపట్టనున్న రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా పనులు చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలని సూచించారు. అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా పర్యవేక్షించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఆర్డీఓ ఎన్.శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా సాయి, ఫహీమ్
- వర్కింగ్ ప్రెసిడెంటుగా ఉపేందర్, సంయుక్త కార్యదర్శిగా సతీష్ ఎన్నిక
- మహాసభ తీర్మానాలపై దశలవారీ ఉద్యమాలు చేపడతాం : కార్యదర్శి ఫహీమ్





**కొత్తగూడెం, ఆగస్టు 29 (తెలంగాణ వాణి)**
ఇటీవల సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్'లో జరిగిన అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నిర్మాణ మహాసభలో నూతనంగా ఎన్నికైన కౌన్సిల్ సభ్యుల తొలి సమావేశం శనివారం శేషగిరిభవన్'లో జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు నూతన ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. ప్రధాన కారకార్యదర్శిగా ఎస్ కె ఫహీమ్ దాదా (కొత్తగూడెం), అధ్యక్షులుగా అనుముల సాయి (ములకలపల్లి), వర్కింగ్ ప్రెసిడెంట్ గా జర్పుల ఉపేందర్ (లక్ష్మీదేవిపల్లి), సంయుక్త కార్యదర్శిగా సాధనపల్లి సతీష్ (భద్రాచలం), సహాయ కార్యదర్శులుగా ఎస్ కె ఖయూమ్, బరిగేల భూపేష్, ఎస్ కె చాంద్ పాషా, ఎండి నదీమ్, సొల్లు రవికిరణ్, ఎస్ డి జాకీర్, భూక్యా రాజేష్, యాంఁద్ర మహేష్, చంద్రగిరి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా నూనావత్ ఎం నవీన్, నామా వినోద్, ఎస్ డి అమీర్, కొచ్చర్ల రాకేష్, సలిగంటి నవీన్, దారావత్ శ్రీను, యు నాగరాజు, పరిపర్తి రాజు, యెల్లబోయిన నవీన్, సోషల్ మీడియా బాధ్యులుగా అజయ్ తోపాటు 73మందితో యువజన సమాఖ్య జిల్లా నూతన కమిటీ ఏర్పాటైంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహాసభలో ఆమోదించిన తీర్మానాలపై జిల్లా వ్యాపితంగా దశలవారీ ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ప్రధానంగా బిజెపి ప్రభుత్వం ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాల హామీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నిరుద్యోగ వృత్తి, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, ఉద్యోగ ఖాళీలు వంటి వాటిపై ఉద్యమాలు చేపడతామన్నారు.

## కేశవరెడ్డికి నివాళులర్పించిన నాయకులు,ప్రజా ప్రతినిధులు.



**తల్లాడ, ఆగస్టు 29, (తెలంగాణ వాణి):**
మాజీ సొసైటీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి సోదరుడు దుండేటి కేశవరెడ్డి అనారోగ్యంతో శనివారం ఉదయం 7.0 గంటలకు మృతి చెందారు.విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకులు, మరియు వివిధ పార్టీల నాయకులు గొల్లగూడెంలో ఆయన గృహానికి చేరుకొని కేశవరెడ్డి భౌతిక ఖాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోపిశెట్టి వెంకటేశ్వర్లు,దిరిశాల నరసింహారావు, పగడాల లచ్చిరెడ్డి, కోడూరి వీరకృష్ణ ,ధూపాటి భద్రరాజు, మారెళ్ళ మల్లికార్జునరావు, తుమ్మలపల్లి రమేష్, దీవెల కృష్ణయ్య, తాళ్ల జోసఫ్,కోడూరీ శ్రీనివాసరావు,పొట్టేటి జనార్దన్ రెడ్డి,తూము వెంకట నారాయణ, నున్న శ్రీను,సారక్క రెడ్డి తదితరులు కేశవరెడ్డికి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## సింగరేణి పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవం



**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి)**
: గిడుగు వెంకట రామమూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతులను పురస్కరించుకుని సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి సింగరేణి పాఠశాలల జనరల్ మేనేజర్ జి. రాజేంద్ర ప్రసాద్ క్రీడలు, యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మాతృభాషను గౌరవిస్తూ ఇతర భాషలను నేర్చుకోవాలని, విద్యార్థులు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా వక్తృత్వం, తెలుగు భాషా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**కరీంనగర్:ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిది)**
ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవర ణ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు.శనివారం హైదరాబాద్ నుండి ఉన్నత అధికారులతో కలిసి వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు,జిల్లా ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ లు,ఎ.ఈ.ఆర్. ఓ.లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం లో నోటీసుల జారీ,పరిష్కా ర చర్యలపై సమీక్ష సమావే శం నిర్వహించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రా ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటీసుల పంపిణీ వేగవంతం చేయా లని,ఫిర్యాదులు,అభ్యంత రాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టాలని, సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.నోటీసుల పంపిణీ ప్రక్రియను మరింత వేగవం తం చేసి,పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసులను సంబంధి త వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని,నోటీసులు అందజేసిన రోజు నుండి




7 రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ నిర్వహిం చాలని సూచించా రు.అనామలీస్/నో మ్యాపిం గ్ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని,సంబంధిత వ్యక్తులు క్లెయిమ్స్,అభ్యం తరాల సందర్భంగా సమ ర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. క్లెయిమ్స్,అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజువారీ ప్రాతిపదికన నోటీస్ బోర్డుపై నవీకరించాలని,( ప్రక్రియలో



పారదర్శకత,జవాబుదారీ తనం పాటిస్తూ,నిర్దేశిత గడువులో పనులను పూర్తి చేయాలని తెలిపారు.ప్రజల కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ కొరకు నియమించి న ఎ.ఈ.ఆర్.ఓ.లకు అవసరమైన శిక్షణ అందిం చాలని,గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధు లతో సమావేశాలు నిర్వ హించి ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# సింగరేణిలో హామీల అమలు ఎక్కడ?

- గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల తీరుపై టీబీజీకేఎస్ విమర్శలు
- సెప్టెంబర్‌లోగా లాభాలు ప్రకటించి కార్మికులకు

**40 శాతం వాటా ఇవ్వాలి: కాపు కృష్ణ**

**కొత్తగూడెం, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జిమ్మిక్కులు చేస్తున్నాయని తెలంగాణ బొగ్గుబావి కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కాపు కృష్ణ విమర్శించారు. కొత్తగూడెంలోని టీబీజీకేఎస్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ 36, ఏఐటీయూసీ 48 హామీలు ఇచ్చినా రెండేళ్ల ఎనిమిది నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్మికులను ఆకట్టుకునేందుకు కొత్త ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని, వైద్య బోర్డులు, వారసత్వ ఉద్యోగాలు, ప్రమోషన్లు, 250 గజాల ఇంటి స్థలం, రూ.20 లక్షల వడ్డీలేని రుణాలు, మారుపేర్ల సమస్య తదితర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యలను




యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని కోరారు. సింగరేణి లాభాలను సెప్టెంబర్‌లోగా ప్రకటించి, వచ్చిన లాభాల్లో 40 శాతం కార్మికులకు వాటాగా ఇవ్వాలని కాపు కృష్ణ డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమతో సంస్థకు లాభాలు వస్తున్నందున వారికి న్యాయమైన వాటా కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శ్రీనివాస్ రావు , రాజశేఖర్, కె. విజయ్ కుమార్, కంచర్ల శ్రీనివాస్, మారపాక తిరుపతి, రవి వర్మ, సూర్యనారాయణ, ఎన్. వెంకట రెడ్డి, ఎన్. శంకర్ ,శ్రవణ్, జి. దేవా సింగ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు సింగరేణి యాజమాన్యం భరోసా

**మ్యాచ్‌ల నిర్వహణకు పూర్తి సహకారం: ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ రజాక్**

**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
క్రీడల అభివృద్ధికి సింగరేణి యాజమాన్యం అండగా ఉంటుందని, క్రీడా మ్యాచ్‌ల నిర్వహణకు అవసరమైన సహకారం అందిస్తామని కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ అన్నారు. రుద్రంపూర్‌లోని జయశంకర్ గ్రౌండ్‌లో శంభో-11, పవర్‌జెన్ (కేటీపీఎస్) జట్ల మధ్య జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను శనివారం రజాక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. యువ క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే ప్రోత్సాహం, మెరుగైన సౌకర్యాలు అవసరమని పేర్కొన్నారు. జయశంకర్ గ్రౌండ్ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని, భవిష్యత్తులోనూ క్రీడా కార్యక్రమాల నిర్వహణకు సహకరిస్తానని తెలిపారు. గ్రౌండ్‌లో మ్యాచ్‌కు అనుమతి ఇచ్చిన కొత్తగూడెం ఏరియా జీఎం వెంకటరమణకు కృతజ్ఞతలు తెలిపారు.



క్రీడాకారులు మ్యాచ్‌లు నిర్వహించుకునేందుకు అవసరమైన అనుమతుల విషయంలో సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఫ్రెండ్లీ మ్యాచ్‌లో పవర్‌జెన్ జట్టు శంభో-11పై విజయం సాధించింది. విజేత జట్టును రజాక్ అభినందించారు. జయశంకర్ గ్రౌండ్‌లో క్రీడా కార్యక్రమాలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు రజాక్ చేస్తున్న కృషిని పలువురు అభినందించారు.

# ఫీజు బకాయిలపై బీజేపీ పోరుబాట

- విద్యార్థులకు ఒకే విడతలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

**కొత్తగూడెం, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, ఒకే విడతలో చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పిలుపు మేరకు ఫీజు బకాయిల విడుదల కోరుతూ శనివారం కొత్తగూడెం అమరవీరుల స్తూపం వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. యువమోర్చా అధ్యక్షుడు జజ్జూరు మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. సుమారు రూ.15 వేల కోట్ల బకాయిలను ఒకే విడతలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు డాక్టర్ జాటోత్ వెంకన్న, బిక్షపతి, బోగి కృష్ణ, కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు గొట్టిపుల్ల దుర్గా శ్రీనివాసరావు, మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముసుకు శ్రీనివాస్



రెడ్డి, ఉపాధ్యక్షుడు భూక్యా శ్రీను, మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి,, గిరిజన మోర్చా అధ్యక్షురాలు భూక్యా స్వాతి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జటంగి కృష్ణ, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు చాపలమడుగు రాకేష్ కుమార్ బాబు, ఐటీ సెల్ కన్వీనర్ బిమల్ కుమార్ జైన్, జిల్లా కార్యదర్శులు రఘురాం, దురుశెట్టి కుమార్, మీడియా కన్వీనర్ కోలికపోగు రామారావు, మండల అధ్యక్షులు బలగం శ్రీధర్, పల్లపు వెంకటేశ్వర్లు, ముత్యాల శ్రీనివాసరావు, యువమోర్చా ప్రధాన కార్యదర్శి కోలా హరీష్, నాయిని శ్రీనివాస్, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ సలీం, గుమలాపురపు సత్యనారాయణ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలి

**పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేయొద్దు: జేబీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**

**కొత్తగూడెం, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
పాలిటెక్నిక్ కళాశాలలను ఇతర శాఖలో విలీనం చేస్తూ జారీ చేసిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని జైభీమ్ రావు భారత్ పార్టీ (జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు.శనివారం కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ జీవో నంబర్ 97తో సాంకేతిక విద్య ప్రత్యేకత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులు ఈసెట్ ద్వారా నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశించే అవకాశాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును



దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని పునఃపరిశీలించి జీవోను రద్దు చేయాలని కోరారు. లేకపోతే విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకుని ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేబీపీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరునాయక్, వినయ్, బన్నీ, రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.




## ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే షాబీర్ పాషా**

**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి)**
: సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే షాబీర్ పాషా పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్మిక సంక్షేమ చట్టాలను నీరుగార్చేలా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆరోపించారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినం, కార్మిక హక్కులు, సంక్షేమ చట్టాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కనీస వేతనాల పెంపు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భవిష్యత్ పోరాటాలపై మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 750 మంది ప్రతినిధులు మహాసభలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, కార్యదర్శి నరాటి ప్రసాద్, నాయకులు జి.నగేష్, భూక్య శ్రీనివాస్, జి.వీరస్వామి, రేణు ఎల్లయ్య, గుర్రం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సమ్మె నోటీసు దెబ్బకు దిగివచ్చిన సింగరేణి యాజమాన్యం

**కార్మికుల హక్కుల సాధనలో మరో ముందడుగు: ఏఐటీయూసీ**



**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం ఏఐటీయూసీ చేపట్టిన పోరాటానికి మరో విజయం లభించిందని నాయకులు తెలిపారు. శనివారం వీకే కోల్‌మైన్ వద్ద బ్రాంచ్ కార్యదర్శి జక్కుల గట్టయ్య అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు.జూన్ 8న ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు, ఆర్‌ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చలు, నిరంతర ఒత్తిడి ఫలితంగా పలు డిమాండ్లపై సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించిందన్నారు. పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యం భరించడం, సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం, ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహణ, 149 మంది మెడికల్ ఫిట్ డిపెండెంట్లకు ఆఫీస్ ఆర్డర్లు, సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు ప్రమోషన్లపై అంగీకారం సాధించామని తెలిపారు.సింగరేణిలో కొత్త బొగ్గు గనులు కేటాయించడం, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ వైద్య సదుపాయం, సేఫ్టీ మెటీరియల్, సొంత ఇంటి పథకం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తదితర అంశాలపైనా యాజమాన్యం సానుకూలంగా స్పందించిందన్నారు. మిగిలిన సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కత్తెర్ల రాములు, వీకే కోల్ మైన్ పిట్ కార్యదర్శి ఏం ఆర్ కే ప్రసాద్, ఆఫీస్ బ్యారర్స్ హీరాలాల్, కుర్ర రమేష్, మెంగన్ రవి, ప్రభాకర్, కోటి, ఓదెలు, రాజారత్నం, లక్ష్మీనారాయణ, సోములు, తిరుమలరావు, రమేష్, ఏసుపదం, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలి



**హసన్‌పర్తి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని హసన్‌పర్తి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్ ఆరోపించారు. ఈ నెల 2 నుంచి 8 వరకు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయ వంతం చేయాలని కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ 66వ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్,53వ డివిజన్ ఇన్‌చార్జి బోడ యుగంధర్,గిన్నారపు రవీందర్,ఇమ్మడి రాజేందర్, కేదాసి రాకేష్,దోనపాటి చంద్రకర్‌రెడ్డి,దాసరి మారి, చాతల్ల వేణు,మట్టెడ ప్రమోద్, తాళ్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు

## ఎఫ్ఎల్ఎన్‌తో గుణాత్మక విద్య అందించాలి



**హసన్‌పర్తి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు ఎఫ్ఎల్ఎన్ ద్వారా అభ్యాస సామర్థ్యాలను మెరుగుపరచి గుణాత్మక విద్య అందించాలని హసన్‌పర్తి మండల విద్యాశాఖ అధికారి ఎ. శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపికైన 12 పాఠశాలల్లో ఏఐ ఆధారిత విద్యాబోధనను సమర్థవంతంగా అమలు చేయాలని, హాజరు నమోదు, పాఠశాలల పరిశుభ్రత, మౌలిక వసతులు, విద్యార్థుల భద్రత, మధ్యాహ్న భోజన నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పుల్ల సంపత్, డి.రవికుమార్, ఆర్. రవీందర్ తదితర ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు

## కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**వనపర్తి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రభుత్వ వనపర్తి మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం స్పోర్ట్స్ కన్వీనర్ జి. యువ రూపలక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి. ఈశ్వరయ్య అధ్యక్షతన ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, కబడ్డీ, హాకీ వంటి క్రీడలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీరామరాజు యాదవ్, స్పోర్ట్స్ కో కన్వీనర్ డాక్టర్ కే విజయలక్ష్మి, డాక్టర్ పోతురాజు శ్రీనివాస్, డాక్టర్ జి సుష్మ, స్రవంతి మొదలగు ఉపన్యాసక బృందంతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మోహన్‌రావు పాటిల్



**నిర్మల్ - తానూర్: ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఎల్వీ గ్రామంలో ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీటీసీ బాపూరావు తండ్రి మాజీ సర్పంచ్ శంకర్,పోతన్న తల్లి బీరాబాయి కుటుంబాలను ప్రజా ట్రస్ట్ చైర్మన్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భోస్లే మోహన్‌రావు పాటిల్ పరామర్శించారు.బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి సభ్యులను ఓదార్చిన ఆయన, మృతుల వివరాలు తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు గ్రామ యువకులు పాల్గొన్నారు.

## 35 ఏళ్ల సేవలకు వీడ్కోలు.. వేణుగోపాల స్వామి పదవీ విరమణ

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**



విద్యుత్ రంగంలో 35 ఏళ్లపాటు అంకితభావంతో సేవలందించిన టీజీ ట్రాన్స్‌కో శాపూర్‌నగర్ 220/132/33 కేవీ సబ్‌స్టేషన్ ఏఈడీ బి. వేణుగోపాల స్వామి ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. విధి నిర్వహణలో ఆయన సేవలు, నిబద్ధత అభినందనీ యమని సహచరులు పేర్కొన్నారు. తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ షౌకత్ పాషా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

# ఓరుగల్లు వేదికగా సెప్టెంబర్ 4న శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**హనుమకొండ, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
హనుమకొండలో సెప్టెంబర్ 4న శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ సంగం రెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ తెలిపారు. శుక్రవారం రాంనగర్‌లోని బీసీ భవన్‌లో వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించి మీడియాతో మాట్లాడారు. సెప్టెంబర్ 4న మధ్యాహ్నం 2 గంటలకు రాంనగర్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం గోవుల పూజ, శ్రీకృష్ణుడి పూజ, తొట్లు ఊపే కార్యక్రమంతో పాటు యాదవుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.



పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల చైర్మన్ షైన్ విద్యాసంస్థల చైర్మన్ యాదవ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మూగల కుమార్ యాదవ్, యాదవ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు ఎల్లావుల లలిత యాదవ్, జనగాం జిల్లా యాదవ సంఘము అధ్యక్షుడు రమేష్ యాదవ్, కాశబోయిన దూదయ్య యాదవ్, కిషోర్ యాదవ్, పెద్ద బోయిన నాగరాజు యాదవ్, సుర ప్రమోద్ యాదవ్,దాడి చిరంజీవి యాదవ్, సాయి యాదవ్,పెద్ద ఎత్తున యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు

## వేయి దేవాలయాలు కట్టడం కంటే ఆకలితో ఉన్న కడుపు నింపటం మహాపుణ్యం

**హుజూర్ నగర్ ఆగస్టు29 తెలంగాణ వాణి**
హుజూర్ నగర్ పట్టణానికి అతి సమీపాన స్వయం భుగా వెలిసిన స్వామి పడగ రాయి గుట్ట స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆ స్వామి సన్నిధిలో ప్రతి శుక్రవారం దాతల సహకారంతో ఆలయ కమిటీ వారు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు అంతేకాకుండా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇట్టి అన్నదాన దాత' 'పడగరాయగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ వారు" ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం చేయడం గొప్ప భాగ్యముగా భావిస్తున్నాం అని వారు తెలియజేశారు అదేవిధంగా . ప్రతి శుక్రవారం భక్తులు తమ దాతృత్వం చాటుకుంటున్నారు స్వామి వారి సన్నిధికి వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు ఎంతో. బాధ్యతతో నిర్వహిస్తున్నామని వారు తెలియ జేశారు .ఆలయ కమిటీ వారు ప్రతి శుక్రవారం అందు



బాటులో ఉంటూ ఆలయ అభివృద్ధికి తోడ్పడుతున్నారు అదేవిధంగా. భక్తులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆ .దేవుని కరుణ కటాక్షాలు మీ మీద ఉండాలని ఆలయ కమిటీ వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు శాగం రెడ్డి కృష్ణారెడ్డి ప్రధాన కార్యదర్శి పొనుగుపాటి వెంకటేశ్వరరావు కోశాధికారి గుర్రం చిన్న వెంకటరెడ్డి ఉపాధ్యక్షులు తోడేటి సర్వయ్య వీరవల్లి గురునాథం శంకరమ్మ అమరోజ్ నాగరాజ్ భక్తులు తదితరులు పాల్గొన్నారు

## వివిధ కుటుంబాలను పరామర్శించిన నాగుర్ల



**తెలంగాణ వాణి,ఉమ్మడి వరంగల్ బ్యూరో, (ఆగస్టు 29) :**
పరకాల నియోజకవర్గంలోని నడికూడ, ఆత్మకూరు మండలాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు శనివారం పరామర్శించారు.నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామ ఉపసర్పంచ్ వర్ణం శ్రీధర్‌రెడ్డి తండ్రి వర్ణం సాంబారెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన నివాసానికి వెళ్లిన నాగుర్ల వెంకటేశ్వర్లు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అదేవిధంగా చట్టం రిపోర్టర్ ఓదెల శివ తండ్రి ఓదెల బిక్షపతి మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఆత్మకూరు మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మానగాని రాజు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని కూడా నాగుర్ల వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులు, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో నర్సక్కపల్లి గ్రామ సర్పంచ్ కోడెపాక ఐలయ్య, వరికెల కిషన్‌రావు, నాగుర్ల ధర్మారావు, సురావ్ శివరావు, ప్రభు, రాకేష్, భాస్కర్, వీరేశం,తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుసడ్ల సదానందం, మండల అధ్యక్షుడు ఎండీ బాబుమియా, వంగేటి వేణు, పసుల లక్ష్మీనారాయణ, దొంక దువ్వ రాజన్న, చిట్టే రవి, భాషబోయిన సాగర్, కిన్నెర రాజేందర్, ఉడుత శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఎఫ్ఎల్ఎన్‌ను బాధ్యతగా అమలు చేయాలి

**ఆదిలాబాద్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల ప్రాథమిక అభ్యసన సామర్థ్యాలను పటిష్ఠం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం టీటీడీసీలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎఫ్ఎల్ఎన్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రగతిని పరిశీలించి, పాఠశాలల తనిఖీ నివేదికలపై సమీక్షించారు. ఎఫ్ఎల్ఎన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి నెల 25న పాఠశాల, 26న మండల, 27న జిల్లా స్థాయి సమీక్షలు నిర్వహించాలని సూచించారు. బోధనా అభ్యసన సామగ్రి (టీఎల్ఎం)తో బోధనను ఆకర్షణీయంగా, సులభతరం చేయాలని తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు మండల స్థాయి టీఎల్ఎం మేళాలు, 22న జిల్లా స్థాయి మెగా టీఎల్ఎం మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఉత్తమ



బోధనకు కంటేగాం ఎంపీపీఎస్ హెచ్ఎం గోవింద్‌కు ప్రశంసాపత్రం అందజేసి ఎఫ్ఎల్ఎన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, అకడమిక్ కోఆర్డినేటర్ లక్ష్మణ్, మండలాల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, కాంపిటెంట్ పాఠశాలల హెడ్‌మాస్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



**ఆదిలాబాద్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
విద్యార్థుల సర్వాంగీణ వికాసానికి విద్యతో పాటు క్రీడలు ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని గురుకుల కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్క నాటారు. మేజర్ ధ్యాన్‌చంద్ సేవలను స్మరించుకున్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను పెంపొందించుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన ఎల్ఈడీ ప్యానెల్‌ను ఆవిష్కరించి, క్రీడా విజేతలకు ప్రశంసాపత్రాలు, విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనిల్, వైస్ ప్రిన్సిపాల్ యోగేష్ దీక్షిత్, అధ్యాపకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



## ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

**హసన్‌పర్తి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిది)**
రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ సూచించారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పీస్ కమిటీ సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలని సూచించారు. లౌడ్‌స్పీకర్లు, డీజేల విషయంలో నిబంధనలు పాటించాలని, నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనల మేరకు ఊరేగింపు నిర్వహించాలని కోరారు. సమావేశంలో ఎస్సైలు రవి, గోవర్ధన్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేపచెట్టు విషయంలో ఘర్షణ.. ఇద్దరి మృతి

**మేళ్లచెరువు, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**



సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగట్టు తండాలో పాత కక్షల నేపథ్యంలో వేపచెట్టు విషయంలో శనివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో గొడ్డలితో జరిగిన దాడిలో మంద వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన సైదా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు సమాచారం. ఘర్షణను అదుపు చేసేందుకు ప్రయత్నించిన ఎస్సై నవీన్‌కుమార్‌కు కూడా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మోహన్‌రావు పాటిల్



**నిర్మల్ - తానూర్: ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఎల్వీ గ్రామంలో ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీటీసీ బాపూరావు తండ్రి మాజీ సర్పంచ్ శంకర్,పోతన్న తల్లి బీరాబాయి కుటుంబాలను ప్రజా ట్రస్ట్ చైర్మన్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భోస్లే మోహన్‌రావు పాటిల్ పరామర్శించారు.బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి సభ్యులను ఓదార్చిన ఆయన, మృతుల వివరాలు తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు గ్రామ యువకులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలి



**ఎల్లారెడ్డి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సుమారు రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మంత్రి సీతక్కను కోరారు. శనివారం మంత్రిని కలిసి అంగన్‌వాడీ భవనాలు, రహదారులు, వంతెనలు, సీడీ వర్క్స్, స్పోర్ట్స్ స్టేడియం, గోడౌన్లకు రోడ్డు సౌకర్యం, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి మండలాల్లో నూతన ఎంపీడీవో కార్యాలయాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు అందజేశారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతిపాదనలను పరిశీలించి వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**లక్షెట్టిపేట, ఆగస్టు 29(తెలంగాణ వాణి).**
పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సాధాన మాట్లాడుతూ.. మన దేశంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 29న ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. ధ్యాన్ చంద్ కి హాకీ మాంత్రికుడు, దిగ్గజ ఆటగాడు అనే పేరున్నాయని గుర్తు చేశారు. ఆయన సాధించిన అద్భుత విజయాలు దేశవ్యాప్తంగా ఉన్న అథ్లెటిక్స్, క్రీడా ప్రోత్సహితులకు స్ఫూర్తినిస్తాయని కొనియాడారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలో కూడా ఉత్సాహంగా పాల్గొనాలని, ఒక ధ్యాన్ చంద్ లా ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. క్రీడలు శరీర దృఢత్వాన్ని, మనోధైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమం లో మంచిర్యాల జోనల్ ఎజిఎం అరవింద రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు, అకాడమిక్ డీన్ సతీష్ , ప్రైమరీ ఇంచార్జి శైలజ, పి పి టి ఇంచార్జి అశ్విని, పి ఈ టి రమేష్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## బోర్గాం(పి) జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన కలెక్టర్



**నిజామాబాద్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మోపాల్ మండలం బోర్గాం(పి) జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం సందర్శించారు. పాఠశాలలో 1,120 మంది విద్యార్థులు చదువుతుండటం, ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయ స్థాయి అవార్డులు లభించడంపై కలెక్టర్ అభినందించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్రీడా మైదానం, అదనపు తరగతి గదుల కోసం పాఠశాల విస్తరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించి, ఫిజిక్స్, మ్యాథ్స్, ఇంగ్లిష్ అంశాలపై ప్రశ్నలు అడిగారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు పెన్నులు అందజేశారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు ప్రపంచ జ్ఞానాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో డీఈఓ పి. అశోక్, తహసీల్దార్ రేఖ, ఎంఈఓ సాయిలు, హెచ్‌ఎం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మాలలపై కక్ష్యపూరిత విధానాలు మార్చుకోవాలి



**మందమర్రి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
మాల కులస్థులపై ప్రభుత్వం అనుసరిస్తున్న కక్ష్యపూరిత విధానాలను మార్చుకోవాలని మాల సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్, మందమర్రి పట్టణ అధ్యక్షుడు దాసరి రామన్న డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రోస్టర్‌ను సవరించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. మాలల భవిష్యత్తును దెబ్బతీసే జీవో నంబర్ 99ను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ నెల 31న నిర్వహించనున్న ఛలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమంలో మాలలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోడం శ్రీనివాస్, బండ రవి, నీరటి శ్రీశైలం, బబ్బెర రవి, నూకల శివాజీ, మడిగం గోపి, కొంద్ర లక్ష్మణ్, గొట్టే అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం.. ప్రారంభోత్సవాలు



**తాంసి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తాంసి మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి శనివారం శ్రీకారం చుట్టారు. తాంసి మార్కెట్ యార్డులో రూ.30 లక్షలతో నిర్మించనున్న గోదాం పనులకు ఎంపీ భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. అనంతరం సాయిబాబా మందిరం సమీపంలో సైడ్ డ్రెయిన్, ఎస్సీ కాలనీలో రూ.6 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. రైతులకు, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## సెన్సస్ హ్యాండ్‌బుక్ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



**నిర్మల్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సెన్సస్ హ్యాండ్‌బుక్ కోసం సేకరించిన సమాచారాన్ని నిర్దేశిత ప్రొఫార్మాలో ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం నిజామాబాద్ నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సెన్సస్ హ్యాండ్‌బుక్ రూపకల్పనపై సమీక్ష నిర్వహించారు. మండలాలు, మున్సిపాలిటీల వారీగా సేకరించిన వివరాలు, ఇంకా సేకరించాల్సిన సమాచారంపై ఆరా తీశారు. నమోదు చేసే సమాచారం ఎలాంటి తప్పులు లేకుండా ఖచ్చితంగా ఉండేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, సీపీఓ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఘనంగా జాతీయ క్రీడ దినోత్సవ వేడుకలు

**ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్, ఆగస్టు : 29 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
క్రీడా పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం క్రీడా జ్యోతి వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,



జిల్లాలో ఆదిలాబాద్, జైనథ్, ఐటిడిఎ స్పోర్ట్స్ పాఠశాలలు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. క్రీడాకారుల ప్రగతికి అవసరమైన మౌలిక వసతులు, కోచ్‌లు, ప్రిన్సిపాల్స్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జూడో, హాకీ తదితర విభాగాలలో జిల్లా విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని భరోసా కల్పించారు. నంతరం జిల్లాలోని పలువురు పూర్వ క్రీడాకారులను శాలువాలతో సత్కరించి, మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ దయానంద్ రెడ్డి, ప్రముఖ క్రీడాకారులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్స్ పంపిణీ



**మందమర్రి ఆగస్టు 29 (తెలంగాణ వాణి)**
మందమరి కళ్యాణి ఖని పాఠశాల విద్యార్థులకు ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యా యురాలు రజిత శ్రీలత సమక్షంలో పంపిణి చేశారు. ఈ సందర్భంగా ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ అజీమోద్దీన్ మాట్లాడుతూ. విద్యార్థుల భవిష్యత్తుకు పరీక్షలు ఎంతో ముఖ్యమైనవని,పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో, మా వంతు సహాయంగా విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నామని, అలాగే, ఇలాంటి సేవా కార్యక్రమాలకు సహాయం చేయాలని ఆసక్తి ఉన్న దాతలు, సేవాభిమానులు ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నందిపాటి రాజ్ కుమార్, కార్యదర్శి గాండ్ల సంజీవ్ పటేల్, ఎండి జావిద్ పాషా, అన్వేష్, సూర్య, ఇమామ్ స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ నిరసన

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో కరీంనగర్ గీతాభవన్ చౌరస్తాలో శనివారం నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం నేతృత్వంలో పార్టీ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసేందుకు నేతలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం సాయిని మల్లేశంతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తిగా విడుదల చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని మల్లేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి లు మాడ వెంకట్ రెడ్డి , తాళ్ల పెల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డి ,ఎర్రబెల్లి సంపత్



రావు ,భింగి వేణు, గుజ్జ శ్రీనివాస్ రావు , కార్యదర్శి సిహెచ్ నరసింహ రాజు. అధికార ప్రతినిధులు బొంతల కల్యాణ్ చంద్ర ఊగులే సుధాకర్ , దుర్శెట్టి సంపత్ యువ మోర్చ అధ్యక్షులు సంగ నరేష్ ఓబీసీ మోర్చ అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఎస్టి మోర్చ అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ , కనుమల్ల గణపతి ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి అడిచెర్ల రాజు మండల , బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేడ్ల ప్రవీణ్ రెడ్డీ అధ్యక్షులు మడిశెట్టి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ కోర్టులో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

**తోటి న్యాయవాదులకు రాఖీలు కట్టిన మహిళా న్యాయవాదులు**

**వేములవాడ,ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
వేములవాడ కోర్టు బార్ అసోసియేషన్ హాల్లో శనివారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మహిళా న్యాయవాదులు తమ తోటి న్యాయవాదులకు రాఖీలు కట్టి, రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి సోదరభావం, ఆత్మీయత, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు న్యాయవాదుల మధ్య స్నేహభావాన్ని, సోదరభావాన్ని మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి తమిరి అన్నపూర్ణ, లైబ్రరీ సెక్రెటరీ మొగిలి సుజాత, బూర సరిత, పావని, సబ్‌కోర్టు ఏపీపీ అవధూత



రజినీకాంత్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గొంటి శంకర్, మాజీ అధ్యక్షులు గుడిసె సదానందం, మాజీ జనరల్ సెక్రెటరీ గడ్డం సత్యనారాయణ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ కనికరపు శ్రీనివాస్, పొత్తూరు అనిల్ కుమార్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతులపై అణచివేత: మాజీ ఎమ్మెల్యే రసమయి

**తిమ్మాపూర్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మానకొండూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పాలన గాడితప్పిందని, ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. శనివారం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గన్నేరువరం రోడ్డు నిర్మాణం మూడేళ్లుగా పూర్తి కాకపోవడంపై ప్రశ్నించిన యువకులను అడ్డుకోవడం, నాయకుల ఇళ్లకు పోలీసులు వెళ్లి బెదిరించడం సరికాదన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా ఉచిత వైద్య శిబిరాల పేరుతో ప్రభుత్వం ప్రచారానికి పరిమితమవుతోందని విమర్శించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు చేస్తున్న వారిపై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని రసమయి స్పష్టం చేశారు.



ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మండల నాయకులు మైపాల్ రెడ్డి, స్వామి రెడ్డి, లింగాల లక్ష్మణ్, ఎలుక ఆంజనేయులు, బోయిని కొమరయ్య, మాతంగి లక్ష్మణ్, వంతడుపుల సంపత్, నాయని వెంకటరెడ్డి, పోన్నం అనిల్, నోముల రాజేష్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## క్రైమ్ పారామీటర్లలో రామగుండం పోలీసుల సత్తా

**పెద్దపల్లి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
క్రైమ్ నియంత్రణ, కేసుల దర్యాప్తు, నేరాల నివారణలో రామగుండం పోలీస్ కమిషనరేట్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచింది. రాష్ట్రంలోని పోలీస్ యూనిట్ల పనితీరును సమీక్షించిన అధికారులు క్లస్టర్--IIలో రామగుండం కమిషనరేట్‌ను ప్రథమ స్థానంలో గుర్తించారు.ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్‌లను డీజీపీ సీవీ ఆనంద్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసింగ్ సేవలు అందిస్తూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించడంపై రామగుండం పోలీస్ అధికారులు,



సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



## మహిళా పారిశ్రామికవేత్తలకు 'ర్యాంప్'తో ప్రోత్సాహం

**నిర్మల్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మహిళలు పారిశ్రామిక రంగంలో రాణించి ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో విజయలక్ష్మి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో మహిళా స్వయం సహాయక సంఘాలు, పారిశ్రామికవేత్తలకు 'ర్యాంప్--ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల ఆధ్వర్యంలోని సూక్ష్మ, చిన్న తరహా వ్యాపారాల అభివృద్ధికి ర్యాంప్ కార్యక్రమం ద్వారా శిక్షణ, మార్గదర్శకత్వం, మెంటరింగ్, రుణ అనుసంధానం, బ్రాండింగ్, మార్కెటింగ్‌లో సహకారం అందిస్తారని అధికారులు వివరించారు. సదస్సులో పథకం అర్హతలు, ఎంపిక విధానం, ప్రయోజనాలపై అవగాహన కల్పించి, ఆసక్తి ఉన్న మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం మారుతి, వి-హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఊహ, ప్రతినిధులు డాక్టర్ డెబోశ్రీ, రూపానంద్, హరిచందన, స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**నిర్మల్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను నిర్మల్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల అధికారి బి. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ భారత హాకీకి ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో ధ్యాన్‌చంద్ సేవలు చిరస్మరణీయమన్నారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రాథోడ్ లక్ష్మణ్, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల రాంచందర్, పీడీలు రమణారావు, రవీందర్‌గౌడ్, అన్నపూర్ణ, భూమన్న, సత్తయ్య, బుచ్చిరామారావు, సుధార్‌సింగ్, పోశెట్టి, వంశీ, కె. శ్రీనివాస్, పీఈటీలు సంజీవ్, గంగాధర్, ముకేష్, భీమేశ్, గిరి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ గ్రోవ్ స్కూల్స్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**చౌటుప్పల్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి**
): చౌటుప్పల్ పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ స్కూల్స్‌లో శనివారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష, సాహిత్య గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి సేవలను స్మరించుకున్నారు. స్కూల్ చైర్మన్ వీణ అనిల్‌రెడ్డి మాట్లాడుతూ మాతృభాష మన సంస్కృతి, సంప్రదాయాలు, అస్తిత్వానికి ప్రతీక అన్నారు. విద్యార్థులు తెలుగును ప్రేమించి చదవడం, రాయడం, మాట్లాడటంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రసంగాలు, కవితలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. డైరెక్టర్ లక్ష్మి, ఏవో మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



**హుస్నాబాద్ ఆగస్టు 29 (తెలంగాణ వాణి ఆర్ సి)**
అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామికి జిల్లా ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్ అవార్డు రావడం తో ఆయనకు గ్రామంలోని యువత సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పాంద్రాల దాము హాజరై ఫీల్డ్ అసిస్టెంట్ కు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ గావెంకటస్వామి సేవలు మరువలేనివని, కష్టపడితే ఫలితం తప్పకుండా ఉంటుందని నిరూపించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన అనారోగ్యంతో ఉన్న పని విషయంలో ఎక్కడా తగ్గలేదని సూచించారు. ప్రతిభ ఉన్నవారిని ప్రభుత్వం తప్పకుండా గుర్తిస్తుందని తెలియ జేశారు.అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామిమాట్లాడుతూ నాకు అవార్డు రావడం చాలాఆనందాన్నిచ్చిందన్నారు. కానీ నాపై మరింత బాధ్యతను పెంచిందని తెలియజేశారు. రాబోవు రోజుల్లోమరింతనిబద్ధతతో పనిచేసి గ్రామానికి మంచి పేరు తీసుకువస్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ ఉపసర్పంచ్ మాచర్ల శ్రీనివాస్, వార్డు సభ్యులురామస్వామి,లతా యాదగిరి, యూత్ సభ్యులు భైరగోని ప్రశాంత్, కందుకూరి రమేష్, పాంద్రాల మోహన్, కార్యదర్శి నిర్మల, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రీడా దినోత్సవ వేడుకలు




**ధర్మారం, ఆగస్టు 29 (తెలంగాణ వాణి )**
ధర్మారం మండలంలోని జెడ్ పి హెచ్ ఎస్ పత్తిపాక పాఠశాల ఆవరణలో యువశక్తి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేజర్ ధ్యాన్ చంద్ జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ మాందాల శ్రావణి హరీష్ హాజరై గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలు జీవితంలో కీలకమైన వని, శారీరక దారుఢ్యంతో పాటు మానసిక దృఢత్వం అలవ డుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరిత, ఫిజికల్ డైరెక్టర్ గౌతమ్, యువశక్తి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కో ఫౌండర్ ఆదర్శ్, సభ్యులు రాకేష్, నితిన్, ఇర్ఫాన్, రిషి, మహేష్, నరేష్ తోపాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## డిపో అభివృద్ధికి ఉద్యోగులు సమన్వయం తో పనిచేయాలి.

### డిపో మేనేజర్ ఎన్. వెంకన్న.



**హుస్నాబాద్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ఆర్.సి)**
హుస్నాబాద్ ఆర్టీసీ డిపో ఉద్యోగులందరూ సమన్వయంతో పని చేసినప్పుడే లాభాల బాట పడుతుందని అందుకు అందరూ ఉద్యోగులు కృషి చేయాలని హుస్నాబాద్ డిపో మేనేజర్ ఎన్. వెంకన్న అన్నారు.రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపి ప్రయాణికులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా గమ్యస్థానాలకు చేర్చేందుకు కృషిచేసిన హుస్నాబాద్ ఆర్టీసీ డిపో కండక్టర్ డ్రైవర్లకు అభినందనలు తెలిపారు. అందులో భాగంగా రాఖీ పౌర్ణమి రోజు బెస్ట్ ఇపీకే తెచ్చిన కండక్టర్ జి. జ్యోతిని డిపో మేనేజర్ శాలువాతో సత్కరించి అభినం దించారు.ఇలాగే అందరూ ఉద్యోగులు ఆదర్శంగా తీసుకొని డిపో అభివృద్ధికి కృషి చేయాలని మేనేజర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి ఐ సారయ్య సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' నోటీసుల పరిష్కారానికి సరైన పత్రాలు సమర్పించాలి



**వేములవాడ, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువులోగా సరైన గుర్తింపు ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని వేములవాడ ఆర్డీఓ కే.ఎస్.బీ. కుమారి కోరారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, చిరునామా మార్పు కోసం ఫారం-8, కొత్త ఓటు నమోదుకు ఫారం-6ను పూర్తి వివరాలతో బీఎల్ఓలకు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వి.నిత్యానందరావ్, బీఆర్ఎస్ నాయకులు పొలాస నరేందర్, టీడీపీ నాయకులు చింతలకోటి రామస్వామి గౌడ్, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## బూత్ అధ్యక్షులు, ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లాలి: బైరి శంకర్




**హుస్నాబాద్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ఆర్.సి):**
ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించేందుకు బూత్ స్థాయి కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ అన్నారు. శనివారం హుస్నాబాద్‌లో బూత్ అధ్యక్షులు, ఏజెంట్లకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు, నోటీసులు అందుకున్న వారు అవసరమైన పత్రాలు సమర్పించి తమ ఓటుహక్కును కొనసాగించుకోవచ్చని తెలిపారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు తుది జాబితాలో ఉండేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, బూత్ అధ్యక్షులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ఘనంగా వన మహోత్సవం



**నాగిరెడ్డిపేట, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో శనివారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 1,500 ఈత మొక్కలు నాటారు. ఎంపీడీవో గంగాధర్, ఎంపీఓ ప్రభాకర్‌చారి, ఎక్సైజ్ సీఐ షాకీర్ హైమద్, గోపాల్‌పేట సర్పంచ్ వంశీకృష్ణగౌడ్ మొక్కలు నాటారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించి, గీత కార్మికులకు ప్రయోజనం చేకూరేలా చూడాలని వారు సూచించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిబ్బంది గౌడ సంఘం సభ్యులు మచేందర్ , సంతోష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ , గౌడ సంఘం సభ్యులు , ఫీల్డ్ అసిస్టెంట్ పృథ్వీరాజ్ , తదితరులు పాల్గొన్నారు .

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**మెదక్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలో శనివారం రన్నింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ జెండా ఊపి పురుషుల 5 కిలోమీటర్లు, బాలికల 2 కిలోమీటర్ల పరుగు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం ధ్యాన్‌చంద్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పోటీల్లో విజేతలకు మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు,మెదక్ జిల్లా పాఠశాల క్రీడా సమైక్య కార్యదర్శి నాగరాజు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఆనందం, ఫుట్బాల్ కోచ్ వినయ్, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు క్రీడాభిమానులు పాల్గొన్నారు

## వరి, పత్తి పంటలకు చీడపీడల ముప్పు



**రైతులకు శాస్త్రవేత్తల కీలక సూచనలు**
**పెద్దపల్లి,ఆగస్టు 29,(తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో వరి, పత్తి పంటలను శాస్త్రవేత్తల బృందం శనివారం పరిశీలించింది. ఏఆర్ఎస్ కూనారం హెడ్ డాక్టర్ సతీష్ చంద్ర, రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఓ. సంపత్ పంటల్లో చీడపీడల పరిస్థితిని పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వరిలో కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు, పత్తిలో తామర పురుగులు, పచ్చదోమ ఉధృతి కనిపిస్తున్నట్లు తెలిపారు. అధిక వర్షాలు, మారిన వాతావరణ పరిస్థితులు, అధిక యూరియా వినియోగం వల్ల తెగుళ్లు పెరిగే అవకాశం ఉందని వివరించారు. శాస్త్రవేత్తల సూచనల మేరకు తగిన మందులు, జిగురు అట్టలు వినియోగించి పంటలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే. సతీష్, శాస్త్రవేత్త డాక్టర్ శరత్ చంద్ర, సర్పంచ్ గడ్డల విమల, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## 26వ వార్డులో ఓటరు జాబితా సవరణ



**మెదక్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మెదక్ పట్టణం 26వ వార్డు పరిధిలోని 155వ పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతోంది. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బూత్ స్థాయి అధికారులు ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్నారు. బీఎల్ఓ మాధవి ఆధ్వర్యంలో బూత్ స్థాయి ప్రతినిధులు, వార్డు సిబ్బంది ఓటర్ల పేర్లు, చిరునామాలు, కుటుంబ సభ్యుల వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేపడుతున్నారు. పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా నిర్ణీత సమయంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమాన్ని ఎన్నికల సూపర్‌వైజర్లు ఎం. స్వామి, ఎండీ అక్బర్ అలీ పరిశీలించారు.




## చెత్తగుట్టలు కదలవు.. పాలకుల మాటలు మారవు

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నగర ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పుగా మారిన డంప్‌యార్డ్‌ను నగరానికి దూరంగా తరలించాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేసింది. శనివారం కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ రోజుకు సుమారు 150 మెట్రిక్ టన్నుల చెత్త డంప్‌యార్డ్‌కు చేరుతోందని, ఇప్పటికే భారీగా చెత్త పేరుకుపోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జి లింగంపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి, చెన్నమల్ల చైతన్య, శ్రీరాముల రమేష్, కుతాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## పట్టణ గంగపుత్ర సంఘ ప్రధాన కార్యదర్శిగా పందిరి శ్రీనివాస్



**కోరుట్ల రూరల్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
కోరుట్ల పట్టణ గంగపుత్ర సంఘ ప్రధాన కార్యదర్శిగా పందిరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ఆయనను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ గంగపుత్ర సంఘ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సంఘ సభ్యుల సంక్షేమం, అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు బొద్దూరి సతీష్, త్రిశక్తి మాత ఆలయ కమిటీ అధ్యక్షుడు కటుకం గణేష్, శ్రీనివాస్, లక్ష్మణ్, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.



## వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికపై గ్రామసభలు

**కోరుట్ల రూరల్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
కోరుట్ల మండలంలోని మాదాపూర్, పైడిమడుగు, జోగినపల్లి గ్రామాల్లో వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక (వీజీపీ) తయారీపై శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికలో చేర్చాలని సూచించారు. తాగునీరు, నీటి సంరక్షణ, రహదారులు, పారిశుధ్యం, మౌలిక వసతులు, ఉపాధి--జీవనోపాధి, విపత్తుల నివారణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్ సర్పంచులు జంగ భూలక్ష్మి, బదుగు భూమేశ్వర్, బద్దం తిరుపతిరెడ్డి, కార్యదర్శులు శ్రీనివాస్, ప్రియాంక, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## టీసీలు ఇవ్వడం లేదంటూ విద్యార్థుల ధర్నా



**జమ్మికుంట, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
జమ్మికుంట పట్టణంలోని విస్డం కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు టీసీలు ఇవ్వకుండా యాజమాన్యం తిప్పించుకుంటోందని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యార్థులకు టీసీలు, సంబంధిత సర్టిఫికెట్లు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు కళాశాల యాజమాన్యంతో చర్చించారు. ఆదివారం ఉదయం 10 గంటల తర్వాత టీసీలు అందజేస్తామని యాజమాన్యం లిఖితపూర్వకంగా హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

## నీటి పొదుపు అందరి బాధ్యత: సర్పంచ్ జంగిలి పోచాలు



**పెద్దపల్లి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని గుండారం సర్పంచ్ జంగిలి పోచాలు అన్నారు. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో రైతులకు 'జలసిరి' పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జలసిరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, రైతులు పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని సంరక్షించాలని సర్పంచ్ సూచించారు. నీటి సంరక్షణతో భూగర్భ జలమట్టాలను పెంచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంబీర్ రాజేందర్, వార్డు సభ్యులు పిడుగు సదయ్య, పంచాయతీ కార్యదర్శి బచ్చల ప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) నవీన్, ఫీల్డ్ అసిస్టెంట్ ఏలువాక సతీష్‌తో పాటు గ్రామ ప్రజలు, రైతులు విశేషంగా పాల్గొన్నారు

## కాంగ్రెస్ మోసాలపై కదం తొక్కాలి: పుట్ట మధూకర్



**పెద్దపల్లి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. శనివారం మంథని పట్టణంలోని రాజగృహలో నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజులపాటు మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని నిరసనలను విజయవంతం చేయాలని కోరారు.

## క్రీడాస్ఫూర్తికి వాగేశ్వరి ప్రోత్సాహం



**తిమ్మాపూర్, ఆగస్టు 29, ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం విద్యార్థులతో 'ఫిట్ ఇండియా' ప్రతిజ్ఞ చేయించారు. బీటెక్, డిప్లొమా విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ జి. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అనంతరం ఫిజికల్ డైరెక్టర్లను సత్కరించారు.కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ డాక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. శ్రీనివాస్, సొసైటీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ ఇంటి నంబర్ల కేటాయింపుపై అధికారులకు ఫిర్యాదు



**ధర్మారం, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
ధర్మారం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పోరంబోకు భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు శనివారం తహసీల్దార్ దురిశెట్టి శ్రీనివాస్, ఎంపీడీవో వేముల సుమలతకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు, ఇంటి నంబర్ల కేటాయింపుపై సమగ్ర విచారణ జరిపి, అక్రమంగా కేటాయించిన నంబర్లను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై అధికారులు త్వరలో విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిమేడారం సింగిల్ విండో చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల రాంబాబు, వార్డు సభ్యులు గాజుల రాజు, నాయకులు కూరపాటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గుర్రం తిరుపతి గౌడ్, దేవి నలిని కాంత్, గంధం తిరుపతి, దేవి రాజేందర్, వేల్పుల కుమార్ పాల్గొన్నారు.

## పదో తరగతి టాపర్లకు 'పూర్వ విద్యార్థుల' ప్రతిభా పురస్కారాలు





**జమ్మికుంట, ఆగస్టు 29, (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఆబాది జమ్మికుంట జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో, పదో తరగతి టాపర్లకు పూర్వ విద్యార్థులు నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ అధ్యక్షతన, శనివారం రోజున నిర్వహించిన కార్యక్రమంలో, 2025-26 విద్యాసంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు ఈ బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా, ప్రథమ స్థానంలో నిలిచిన డొంకటి సాక్షితకు రూ. 5,000, ద్వితీయ స్థానంలో నిలిచిన దొడ్డే రణ వర్ధన్‌కు రూ. 3,000, తృతీయ స్థానంలో నిలిచిన మైస అక్షిత్‌కు రూ. 2,000 చొప్పున నగదు పురస్కారాలతో పాటు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు పింగళి వెంకటరెడ్డి, మార్క విజయ్ ప్రకాష్, డాక్టర్ కాటిపల్లి లింగారెడ్డి, అయిత శ్రీనివాస్, అమృత సురేష్‌లు 2015 సంవత్సరం నుంచి ప్రతి ఏటా ఈ ప్రతిభా పురస్కారాలను అందిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి అయిత శ్రీనివాస్ విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించగా, డాక్టర్ లింగారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు విద్యా అవసరాలకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, ఉపాధ్యాయులు రాజేంద్ర కుమార్, కృష్ణమూర్తి, సృజన, రాజశ్రీ, దుర్గాప్రసాద్, స్థానిక కౌన్సిలర్ సుజాత, విద్యార్థుల తల్లిదండ్రులు కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా క్రీడా, భాషా దినోత్సవాలు



**రాయికల్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయికల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు, తెలుగు పండితులను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. రాయికల్ బాయ్స్ హైస్కూల్‌లో బాస్కెట్‌బాల్ కోర్టుకు రూ.15 వేల విలువైన రింగ్స్, రంగులు, బాస్కెట్‌బాల్‌ను అందజేసి ప్రారంభించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వాసం ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడంలో వ్యాయామ ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# 22ఏ భూములపై నిరంతర పోరాటం: హరీష్‌రావు







**పటాన్‌చెరు, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
22ఏ భూముల సమస్యపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తామని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. పటాన్‌చెరులో శనివారం నిర్వహించిన 22ఏ భూముల రైతుల నిరసన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టా భూములు, ఇళ్లు, ప్లాట్లను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. నిషేధిత జాబితాలో ఉన్న పేదల భూములను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తే కేసులు పెట్టడం సరికాదన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జీ ఆదర్శ్ రెడ్డి, తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ఎండీఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మాదిరి పృథ్వీరాజ్, నాయకులు యాదగిరి యాదవ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# క్రీడలే యువతకు బంగారు భవిష్యత్‌కు బాట



**జమ్మికుంట, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యానచంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, ప్రజలు, క్రీడా సంఘాలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాకీ జాతీయ క్రీడాకారులు, మాజీ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, క్రీడాకారులు బండ సాయి, జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గండికోట సమ్మయ్య, డాక్టర్ అంబాల ప్రభాకర్, వంతడుపుల రఘు, బుర్ర కుమార్, తిరుపతి శ్రీనివాస్, కౌన్సిలర్ కొలుగూరి సురేష్, మంద రాజేష్, కంకణాల బిక్షపతి, దామెర శ్యామ్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్, బీఎస్పీ సీనియర్ నాయకులు మారపల్లి మొగులయ్య, గంగారపు రాజయ్య, రాజపల్లి గ్రామ సర్పంచ్ మల్లారెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకురాలు లక్ష్మి, శనివారం భాస్కర్, శనిగరపు జైపాల్, పూలల ప్రశాంత్, పంజాల అరవింద్, మైస వంశీ, గూడెల్లి సాయి, పంజాల శ్రీరామ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్-పీజీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**పెద్దపల్లి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
ఆగస్టు 30న పెద్దపల్లి జిల్లాలో నిర్వహించనున్న నీట్-పీజీ 2026 పరీక్షను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.డీసీపీ రామ్‌రెడ్డితో కలిసి పెద్దకల్వల, పెద్దపల్లి, రామగిరిలోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి 8.45 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, వైద్యం, పోలీస్ బందోబస్తు, సీసీటీవీ, మొబైల్ జామర్లతో భద్రత కల్పించాలని సూచించారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డుతో హాజరుకావాలని, ఎలక్ట్రానిక్ వస్తువులు, గడియారాలు, ఆభరణాలు, షూస్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గంగయ్య, తహసిల్దార్లు, పరీక్షా కేంద్రాల నిర్వాహకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు



# వరి, పత్తి చీడపీడలపై రైతులకు అవగాహన



**పెద్దపల్లి , ఆగస్టు 29(తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం పుట్నూర్ గ్రామంలో వరి, పత్తి పంటల్లో ప్రస్తుతం ఆశిస్తున్న చీడపీడలపై రైతులకు అవగాహన కల్పించేందుకు శాస్త్రవేత్తల బృందం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించింది. ఈ సందర్భంగా ఏ ఏర్ ఎస్ కూనారం పరిశోధన స్థానం హెడ్ డా. సతీష్ చంద్ర, పెద్దపల్లి రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డా. ఓ. సంపత్ వరి, పత్తి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంటలో కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు, పత్తిలో తామర పురుగులు, పచ్చదోమ వంటి చీడపీడలను గుర్తించి వాటి నివారణకు తగిన మందులు, పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు పొలాలను నిత్యం పరిశీలిస్తూ వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు వినియోగించాలని సూచించారు. పుట్నూర్ సర్పంచ్ తోట ప్రశాంత్ మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచనలను రైతులు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కె. శ్రీకాంత్, మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, శాస్త్రవేత్తలు డా. శరత్ చంద్ర, డా. ఓ. సంపత్, రైతులు పాల్గొన్నారు.



## నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన

**మంచిర్యాల, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
నేత్రదాన అవగాహన పక్షోత్సవాల్లో భాగంగా సాయికుంట గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నేత్రదానం, కంటి ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుంచే కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు.వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం, కంటి సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. నేత్రదానం ద్వారా మరొకరికి చూపును ప్రసాదించి వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని పేర్కొన్నారు. నేత్రదాన ప్రాముఖ్యతను తల్లిదండ్రులు, బంధువులు, గ్రామ ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని విద్యార్థులను కోరారు.అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నిల్వ నీటిని తొలగించడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులను నివారించవచ్చని సూచించారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండి శుభ్రమైన నీరు, పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, జిల్లా కంటి నియంత్రణ కోఆర్డినేటర్ శంకర్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి



**మంచిర్యాల, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
ప్రజల ఆరోగ్యం, సంక్షేమం, అత్యవసర వైద్య సేవలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. లక్సెట్టిపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిమ ఆసుపత్రి యాజమాన్యం సౌజన్యంతో ఏర్పాటు చేసిన వెంటిలేటర్ సౌకర్యం కలిగిన అంబులెన్స్‌ను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రోగులను మెరుగైన వైద్యం అందించే ఆసుపత్రులకు వేగంగా తరలించేందుకు అంబులెన్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల ప్రజలకు అత్యవసర వైద్య సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం అంబులెన్స్ ఏర్పాటు చేసిన ప్రతిమ ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. వైద్య, విద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, వైద్యులు, ఆసుపత్రి ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



## బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం సాయం

**రాజపేట ఆగస్టు: 29(తెలంగాణ వాణి విలేకరి)**
రాజపేట మండల కేంద్రంలో అనారోగ్యంతో మరణించిన దొంతి యాదమ్మ కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో 50 కేజీల బియ్యం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పీ ఏ సి ఎస్ చైర్మన్ నెమిలె మహేందర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు పిండికూర మహేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లెన స్వామి,రేగు సిద్ధులు గుర్రం శ్రావణ్,గుర్రం రూపేష్, కొత్త ఉమేష్ గొల్లెన ప్రశాంత్ జయ రాములు దొంతి రాజు దొంతి రమేష్ బిక్షపతి కనకయ్య కొండయ్య కృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ విచారణ

### మున్సిపల్ కార్యాలయంలో ఓటర్ల సవరణల పరిశీలన

**రాయికల్,ఆగస్టు 29(తెలంగాణ వాణి):**
ఎస్ఐఆర్ (ఎస్ ఐ ఆర్) ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో-మ్యాపింగ్ ఓ అనోమలీస్ నోటీసులు అందుకున్న పట్టణ ఓటర్లలో శనివారం రోజున మున్సి పల్ కార్యాలయంలో హియరింగ్ నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ నెం. 23, 24లకు సంబంధించిన ఓటర్లు హాజరై తమ ఓటర్ పేరు సవరణలు, తప్పుల దిద్దుబాట్లు మరియు ఇతర సవరణలకు తగిన ఆధారాలు/డాక్యుమెంట్లు సమర్పించి వాటిని సవరించుకున్నారు.ఈ సందర్భంగా అధికారులు తెలుపుతూ.. ఈ నెల 21.08.2026 నుండి 05.09.2026 వరకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న హియరింగ్‌కు నోటీసులు అందుకున్న ఓటర్లందరూ హాజరుకావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.మనోహర్, రెవెన్యూ ఆర్.ఐ సుబ్బయ్య, సంబంధిత బి.ఎల్.ఓ లు మరియు పట్టణ ఓటర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత షూస్ పంపిణీ



**పెద్దపల్లి: ఆగస్టు,29(తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి )**
టిటిఎస్: టిటిఎస్ పరిధిలోని ప్రైమరీ, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ఉచిత షూస్‌ను ప్రజాప్రతినిధులు, పాఠశాల కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆంగోతు రవి, ఉప సర్పంచ్ ఉష, వార్డు సభ్యుడు కుర్ర రిషి, స్కూల్ చైర్మన్ సురువాని పాల్గొని విద్యార్థులకు షూస్ అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, గ్రామ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఉచిత షూస్ పంపిణీపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## క్రీడలతో విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసం





**పటాన్‌చెరు, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. పటాన్‌చెరు భారతీనగర్ డివిజన్‌లోని శ్రీ వాణి విద్యానికేతన్ హైస్కూల్‌లో తెలంగాణ రాష్ట్ర 45వ సబ్‌జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్--2026 (బాలురు, బాలికలు) పోటీలను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుని ప్రతిభను మెరుగుపరుచుకుంటే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. పటాన్‌చెరులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వేదిక కల్పిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు, నిర్వాహకులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## డిమాండ్ల కోసం నల్ల బ్యాడ్జీల నిరసన

### ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి: గడియారం శ్రీహరి



**మంచిర్యాల, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో మంచిర్యాల ఆర్డీవో కార్యాలయ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.వేతన సవరణ అమలు, నూతన పింఛను విధానం రద్దు చేసి పాత పింఛను విధానం పునరుద్ధరణ, పెండింగ్‌లో ఉన్న ఆరు కరువు భత్యాల విడుదల, ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు, రూ.12 వేల కోట్ల బకాయిల చెల్లింపు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులకు 17 శాతం ఇంటి అద్దె భత్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 10 వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి కే. రమేష్‌తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

### -- షబ్బీర్ అలీ



**బిక్కనూర్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. బిక్కనూర్ మండలం రామేశ్వరపల్లిలో శనివారం నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్‌తో కలిసి లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం రామేశ్వరపల్లి పీఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని, నూతన చైర్మన్‌గా బద్దం ఇంద్రకరణ్‌రెడ్డిని అభినందించారు. బిక్కనూర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి రూ.200 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. దోమకొండ--బీబీపేట్ ప్రజల సౌకర్యార్థం ఎన్‌హెచ్-44పై ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ఎంపీ సురేష్ షెట్కర్‌తో కలిసి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో ప్రాంతాన్ని పరిశీలించారు. త్వరలో సర్వే నిర్వహించి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

## కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాటం ఉధృతం చేయాలి

**ఎల్లారెడ్డి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. లింగంపేట్‌లోని డీపీఎల్ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్సీలు విజీ గౌడ్, శేరి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆరు గ్యారెంటీల వైఫల్యంపై ధర్నాలు, రైతు సదస్సులు, మహిళలు--వికలాంగులతో సమావేశాలు, విద్యార్థులు--యువతతో ర్యాలీలు, గ్రామీణ సమస్యలపై నిరసనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## పోరండ్ల ఫ్యాక్స్ కు ఎమ్మెల్యే ఆకస్మిక సందర్శన

**తిమ్మాపూర్, ఆగస్టు 29, ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
మండలంలోని పోరండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్)ను మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. అల్గునూరు నుంచి మన్నెంపల్లికి వెళ్తున్న ఆయన మార్గమధ్యలో సొసైటీకి చేరుకుని కార్యాలయం, భవనాలను పరిశీలించారు. ప్యాక్స్ చైర్మన్ గోపు మల్లారెడ్డి ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.సొసైటీ కార్యకలాపాలు, రైతులకు అందుతున్న సేవలు, కార్యాలయ నిర్వహణపై చైర్మన్, డైరెక్టర్లు, సిబ్బందిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన సేవలను సకాలంలో అందిస్తూ ప్యాక్స్‌లు మరింత సమర్థంగా పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో సీఈవో శ్రీనివాస్, సహాయ సీఈవో సురేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, నుస్తులాపూర్ ప్యాక్స్ చైర్మన్ మోరపల్లి రమణారెడ్డి, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, పులి కృష్ణ, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థులు సవాళ్లను స్వీకరించాలి

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా స్వీకరించి, క్రమశిక్షణతో ముందుకు సాగుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ విద్యార్థులకు సూచించారు. హాజీపూర్ మండలం గుడిపేట కేంద్రీయ విద్యాలయంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, ఉపాధ్యాయులు, అధికారులతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థుల సంఖ్య గతంతో పోలిస్తే దాదాపు రెట్టింపు కావడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం 600 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ఇవి ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రీయ విద్యాలయాలు బహుభాషా, బహు సాంస్కృతిక వాతావరణాన్ని కల్పిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదిగి కుటుంబం, సమాజం, జిల్లా, దేశ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

## రసాయన శాస్త్రంలో కిరణ్ కుమార్‌కు పీహెచ్.డీ.



**పటాన్ చెరు, ఆగస్టు 29, (తెలంగాణ వాణి)**
: హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి వున్నం కిరణ్ కుమార్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'ఎస్-బినాల్ ఫాస్ఫేట్, 2,4-థియాజోలిడిన్ డయోన్ ఉత్పన్నాల సంశ్లేషణ, వాటి జీవ క్రియాశీలతల పరిశీలన, ఫావిపిరావిర్ తయారీ విధాన అభివృద్ధి' చేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కనకదుర్గా భాస్కర్ యమాజాల శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ కిరణ్ కుమార్ పరిశోధన, గణనీయమైన చికిత్సా సామర్థ్యం కలిగిన నూతన హెటెరోసైక్లిక్ సమ్మేళనాల రూపకల్పన, సంశ్లేషణ, జీవ మూల్యాంకనం పై దృష్టి సారించినట్టు తెలియ జేశారు. ఈ అధ్యయనం యాంటీ వైరల్ ఔషధం ఫావిపిరవిర్ కోసం ఒక మెరుగైన, విస్తరించదగిన సంశ్లేషణ ప్రక్రియను అభివృద్ధి చేయడంతో పాటు, యాంటీ బాక్టీరియల్, యాంటీ డయాబెటిక్, యాంటీ క్యాన్సర్ కార్యకలాపాలు కలిగిన ఆశాజనకమైన (ఎస్)-బినోల్ ఫాస్ఫేట్, 2.4-థయాజోలిడిన్ డయోన్ ఉత్పన్నాలను గుర్తించిందన్నారు. ఈ పరిశోధన పారిశ్రామిక అనువర్తనాలకు సంభావ్యత ఉన్న ఆచరణాత్మక సంశ్లేషణ పద్ధతులను అందిస్తుందని, భవిష్యత్తు ఔషధ అభివృద్ధి, ప్రీ-క్లినికల్ పరిశోధనలకు బలమైన పునాది వేస్తుందని తెలిపారు.డాక్టర్ కిరణ్ కుమార్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టా కు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు కు చెందిన పలువురు అభినందించడమే గాక, ఔషధ రసాయన శాస్త్ర పరిశోధనకు ఆయన చేసిన విలువైన కృషిని ప్రశంసినట్టు వివరించారు. డాక్టరేట్ పరిశోధన అంతటా అంకిత భావంతో మార్గనిర్దేశనం చేయడంతో పాటు సలహాలు అందించినందుకు డాక్టర్ కనక దుర్గా భాస్కర్ యమాజాలను కూడా అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## 22ఏ భూముల బాధితులకు అండగా బీఆర్ఎస్.. ప్రభుత్వానికి హరీశ్‌రావు హెచ్చరిక



**పటాన్‌చెరు ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
పటాన్‌చెరు నియోజకవర్గంలో 22ఏ నిషేధిత భూముల బాధితులతో బీఆర్ఎస్ నిరసన సమావేశం పటాన్‌చెరు: 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములను వెంటనే తొలగించి బాధితులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎం ఎల్ ఎ తన్నీరు హరీశ్‌రావు తెలంగాణ ప్రభుత్వాన్ని, ముఖ్యంగా సంగారెడ్డి జిల్లా యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు.పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో 22ఏ నిషేధిత భూముల బాధితులతో బీఆర్ఎస్ నిరసన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి భూ బాధితులు, బి ఆర్ ఎస్ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు బాధితులను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 22ఏ జాబితాలో భూములు ఉండటంతో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను బాధితులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గంలో సుమారు 50 వేల ఎకరాల భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని, దీని వల్ల అనేక మంది భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితుల భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. భూ బాధితుల సమస్యను పరిష్కరించకపోతే ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకువస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి విడనాడి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.



## ఫారం పాండ్ల పనులను తనిఖీ చేసిన డీఆర్‌డీఓ

**టేకులపల్లి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
టేకులపల్లి మండలంలోని రోళ్లపాడు, లచ్చగూడెం గ్రామపంచాయతీల్లో జరుగుతున్న ఫారం పాండ్ల పనులను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మస్టర్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో రోజుకు కనీసం 80 మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నుంచి ప్రతి గ్రామంలో కనీసం 5 నుంచి 6 ఫారం పాండ్ల పనులను చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓ, ఈసీ, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**తల్లాడ, ఆగష్టు, 29 (తెలంగాణ వాణి):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి నూతన విధి విధానాలతో నూతన టెక్నాలజీతో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకువచ్చింది. ఈ సందర్భంగా గోపాలపేట గ్రామపంచాయతీ లోని లబ్ధిదారులకు వచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులను గోపాలపేట సర్పంచ్ తాళ్ల సుధారాణి - వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం లబ్ధిదారులకు అందించారు నూతన టెక్నాలజీతో రూపొందించిన ఈ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రతి ఒక్క లబ్ధిదారుడు జాగ్రత్తగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా సర్పంచ్ సుధారాణి సూచించారు. ఈ కార్డు ఉంటేనే ప్రభుత్వం పథకాలకు అర్హులవుతారు అన్నారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి ఉషారాణి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు



## బ్రిక్స్ కంపెనీ వద్ద టైలర్ హత్య.. కేసు ఛేదించిన పోలీసులు

### నలుగురు నిందితులు.. ఇద్దరి అరెస్టు

**మధిర, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
మధిర మండలం ఆత్కూరు రహదారిలోని బ్రిక్స్ కంపెనీ సమీపంలో ఈ నెల 10న జరిగిన టైలర్ ఎండీ తాలిమ్ (45) హత్య కేసును మధిర టౌన్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురిని నిందితులుగా గుర్తించి ఇద్దరిని అరెస్టు చేసినట్లు వైరా ఏసీపీ సారంగపాణి తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.. బ్రిక్స్ కంపెనీ వద్ద తాలిమ్ ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో గద్దల జమలయ్య అలియాస్ ఏసోబు కర్రతో దాడి చేయడంతో అతడు మృతి చెందాడు. అనంతరం మృతుడి సెల్‌ఫోన్, హత్యకు ఉపయోగించిన కర్రను నిందితులు దాచినట్లు తెలిపారు. విషయం తెలిసినప్పటికీ పోలీసులకు సమాచారం ఇవ్వకుండా నిందితులకు సహకరించిన మరో ఇద్దరినీ కేసులో నిందితులుగా చేర్చినట్లు ఏసీపీ వెల్లడించారు. పోలీసులు హత్యకు ఉపయోగించిన కర్ర, మృతుడి సెల్‌ఫోన్, రక్తపు మరకలున్న దుస్తులు, నిందితుడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## వైద్యం అందక ఏడేళ్ల చిన్నారి మృతి..

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడేళ్ల చిన్నారి మృతి చెందడం కలకలం రేపింది. నారాయణపేట మండలం కొల్లంపల్లి గ్రామానికి చెందిన కమ్మరి వెంకట్రాములు కుమార్తె చైత్ర (7) మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చైత్ర రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతోందని శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో చిన్నారి పరిస్థితి విషమించడంతో తల్లిదండ్రులు జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే దాదాపు ఐదు గంటల పాటు వైద్యం కోసం ఎదురుచూసినా వైద్యులు సరైన స్పందన లేకపోవడం వల్లనే తమ కుమార్తె మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. చిన్నారి పరిస్థితి మరింత విషమించడంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కిడ్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ కూడా సరైన వైద్యం అందలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ తిరిగి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు.



## ఎంఈఓ చందా రమేష్‌కు ఘన వీడ్కోలు

**రాజాపేట, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
రాజాపేట మండల ఎంఈఓ చందా రమేష్ పదవీ విరమణ సందర్భంగా శనివారం చల్మెడి ఫంక్షన్ హాల్‌లో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై చందా రమేష్ సేవలను కొనియాడారు. మండల విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. అనంతరం చందా రమేష్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్(టీజేయు) వైస్ ప్రెసిడెంట్ ఎండి.యూసుఫ్, జాల సర్పంచ్ గంధ మల్ల నవనీత నరసింహులు, పారుపల్లి సత్తిరెడ్డి, మండల ఉపాధ్యాయులు, సర్పంచులు పలు పార్టీల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు

## రెండు గంటల్లోనే వాహన చోరీ కేసు ఛేదింపు

### నారాయణఖేడ్ ఎస్ఐ రాసుల శ్రీశైలం

**నారాయణఖేడ్, ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



: నారాయణఖేడ్ మండలంలో ద్విచక్ర వాహనం చోరీ జరిగిన రెండు గంటల్లోనే పోలీసులు కేసును ఛేదించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని హట్యానాయక్ తండాకు చెందిన మేఘావత్ హన్మనాయక్ తన హీరో ఫ్యాషన్ ప్రో వాహనం (టీఎస్15 ఈటీ 9659)ను ఇంటి ముందు నిలిపి ఉంచగా చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదుతో ఎస్ఐ రాసుల శ్రీశైలం ఆధ్వర్యంలో పోలీసులు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి జూకల్ శివారులోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద వాహనాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహన చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు.

## అనారోగ్యంతో మరణించిన - ఆదిరాల పరమేశ్

**నాంపల్లి:ఆగస్టు 29 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



నాంపల్లి మండలంలోని ముష్టిపల్లి గ్రామంలో ఆదిరాల పరమేశ్ వయస్సు 42 సంవత్సరాలు అనారోగ్య బారినపడి హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్లో శనివారం మరణించారు,అతనికి భార్య ముగ్గురు పిల్లలున్నారు, భార్య సైదమ్మ ముష్టిపల్లి గ్రామంలో పారిశుధ్య కార్మికురాలుగా పని చేస్తున్నారు,పెద్ద కూతురు రూప ఈ సంవత్సరంలో నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణులు అయ్యారు.చిన్న కూతురు విన్నీ అగ్రికల్చర్ సెకండ్ సంవత్సరం చదువుతుంది ,అబ్బాయి విన్ను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు, పరమేశ్ వృత్తిరీత్యా తాపీ మేస్త్రి గా ఉండేవాడు.తను జీవితంలో ఎన్ని కష్టాలు పడైన పిల్లలను బాగా చదివించి మంచి స్థానం లో ఉంచాలి అనుకున్నాడు అందులో భాగంగానే రూప కి లాంగ్ టర్మ్ కోచింగ్ ఇప్పించి నీట్ లో సీట్ వచ్చే విధంగా కృషి చేశారు, కానీ అనుకోకుండా ఇలా జరగడం నిజంగా బాధాకరమని గ్రామస్థులు అన్నారు. పరమేశ్ కుటుంబాన్ని మరియు పిల్లల విద్యకు పారిశుధ్య కార్మికురాలుగా పని చేస్తూ ముగ్గురు పిల్లల్ని పోషించడం చాలా కష్టమని స్థానిక రాజకీయ నాయకులు, అధికారులు ఆర్థికంగా అండగా నిలిచి పిల్లల విద్యకి సహకరించాలని స్థానికులు అన్నారు.

## స్నేహానికి సార్థకత.. మిత్రుడి కుటుంబానికి 1996 బ్యాచ్ ఆపన్నహస్తం



**టేకులపల్లి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):**
అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన బాల్యమిత్రుడి కుటుంబానికి అండగా నిలిచి 1996 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు మానవత్వాన్ని చాటుకున్నారు.టేకులపల్లి మండలం దాస్‌తండా పంచాయతీ పరిధిలోని లచ్చతండాకు చెందిన మాజీ అక్షర భారతి మండల కోఆర్డినేటర్, మిషన్ భగీరథ ఆపరేటర్ బాదావత్ హరిదాసు ఈ నెల 21న అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం లచ్చతండాలో నిర్వహించిన కర్మకాండలకు ఆయన పాఠశాల నాటి మిత్రులు హాజరై నివాళులర్పించారు. హరిదాసు కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న 1996 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు తమ వంతు సహాయంగా రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే టేకులపల్లి మండల ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ గుమస్తాల సంఘం తరపున రూ.6 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మిత్రులు హరిదాసుతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు.

## నైజాంలో 'ఇరుముడి' కలెక్షన్ల సునామీ.. రవితేజ కెరీర్‌లో మరో భారీ హిట్!



మాస్ మహారాజా రవితేజ హీరోగా, విలక్షణ దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. భిన్నమైన కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం విడుదలైనప్పటి నుంచి మంచి స్పందన అందుకుంటూ భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. సినిమాలోని కొన్ని సన్నివేశాలపై వివాదం కొనసాగుతున్నప్పటికీ.. కలెక్షన్ల జోరుపై మాత్రం దాని ప్రభావం ఏమాత్రం కనిపించడం లేదు. ముఖ్యంగా తెలంగాణలోని నైజాం మార్కెట్‌లో 'ఇరుముడి' తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. తొలి వారంలోనే తెలంగాణ వ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏడు రోజుల ముగిసేసరికి నైజాం ఏరియాలో సుమారు రూ.26 కోట్లకు పైగా డిస్ట్రిబ్యూటర్ షేర్ వచ్చినట్లు సమాచారం.తెలంగాణ టూరిజం సాధారణ వర్కింగ్ డే అయిన ఏడో రోజున కూడా తెలంగాణలో దాదాపు రూ.3 కోట్ల మేర వసూళ్లు నమోదు కావడం సినిమాకు ఉన్న క్రేజ్‌ను స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న లాంగ్ వీకెండ్ 'ఇరుముడి'కి మరింత కలిసొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆదివారం వరకు అదనంగా భారీ వసూళ్లు రాబట్టే అవకాశం ఉండటంతో, తెలంగాణలో రూ.70 కోట్ల గ్రాస్ మార్కును చేరుకోవడంపై అంచనాలు పెరుగుతున్నాయి. 'ధమాకా' తర్వాత రవితేజ కెరీర్‌లో ఈ స్థాయిలో మాస్ రీచ్, కలెక్షన్ల జోరు కనిపిస్తున్న చిత్రం 'ఇరుముడి' అని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. రవితేజ ఎనర్జీ, ప్రియా భవానీ శంకర్, బేబీ నక్షత్ర నటనతో పాటు శివ నిర్వాణ దర్శకత్వం సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ఇక సినిమాలోని 'మల్లెపూల పల్లకి' పాట చార్ట్‌బస్టర్‌గా మారి ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షిస్తోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్, ఇతర ప్రాంతాల్లోనూ సినిమాకు మంచి ఆదరణ లభిస్తున్నప్పటికీ.. నైజాం మార్కెట్‌లో నమోదవుతున్న రికార్డు స్థాయి వసూళ్లు ప్రత్యేకంగా చర్చనీయాంశమయ్యాయి. ఇప్పటికే పలు థియేటర్లలో హౌస్‌ఫుల్ ప్రదర్శనలతో దూసుకుపోతున్న 'ఇరుముడి'.. ఈ లాంగ్ వీకెండ్ ముగిసే నాటికి ఇంకెన్ని కొత్త రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. రవితేజ అభిమానులు మాత్రం ఈ విజయాన్ని ఫుల్‌గా సెలబ్రేట్ చేసుకుంటున్నారు.

## అక్కినేని నాగార్జున బర్త్‌డే స్పెషల్.. 'కింగ్ 100' టైటిల్ గ్లింప్స్ అప్‌డేట్

టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఆయన కెరీర్‌లో వందో మైలురాయిగా నిలుస్తున్న ప్రతిష్టాత్మక 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. యువ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై ఈ చిత్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.వీశీజఅవం నాగార్జున పుట్టినరోజు కానుకగా ఆగస్టు 29 ఉదయం 9 గంటలకు 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఫాస్టెన్ యువర్ సీట్‌బెల్ట్స్... రేపటి నుంచి కింగ్ ఆధిపత్యం మొదలవ్వబోతోంది అంటూ చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో పంచుకున్న ఈ అనౌన్స్‌మెంట్ ప్రస్తుతం అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.



## 'రేస్ 4'లో ఆమిర్ ఖాన్.. 'ధూమ్ 3' దర్శకుడితో భారీ యాక్షన్ థ్రిల్లర్?



బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ చాలా రోజుల తర్వాత కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రముఖ యాక్షన్ ఫ్రాంచైజీ 'రేస్' నాలుగో భాగంలో ఆయన నటించనున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. 'రేస్ 4' స్క్రిప్ట్ ఆమిర్ ఖాన్‌కు బాగా నచ్చడంతో ఆయన ఈ ప్రాజెక్ట్‌ను చేయడానికి నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, ఈ చిత్రానికి దర్శకత్వం వహించే బాధ్యతలను ప్రముఖ దర్శకుడు విజయ్ కృష్ణ ఆచర్యకు అప్పగించినట్లు సమాచారం. గతంలో ఆమిర్ ఖాన్, విజయ్ కృష్ణ ఆచర్య కాంబినేషన్‌లో వచ్చిన 'ధూమ్ 3' సినిమా భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రాజెక్ట్‌ను విజయ్‌కి ఇవ్వబోతున్నట్లు సమాచారం. కాగా.. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

## కోతి అడ్డురావడంతో ఆటో బోల్తా

**ఇద్దరికి తీవ్ర గాయాలు**

**టేకులపల్లి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి):** రోడ్డుపైకి ఒక్కసారిగా కోతి అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటన శనివారం టేకులపల్లి మండలంలో చోటుచేసు కుంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల వివరాల ప్రకారం.. టేకులపల్లికి చెందిన చీమల మురళి (35), పాయం రాధ (30) ఆటోలో తుమ్మచిలక గ్రామానికి వెళ్తుండగా



దాసుతండా సమీపంలో కోతి రోడ్డుపైకి రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో మురళికి తల, కుడిచేతికి, రాధకు ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. 108 సిబ్బంది సకాలంలో స్పందించడంపై స్థానికులు అభినందించారు.

## జేఆర్ హైస్కూల్ ప్రిన్సిపాల్‌కు జాతీయ స్థాయి కవితా పురస్కారం

**'హోప్' కవితకు ప్రథమ బహుమతి ఏటూరునాగారం**

**జేఆర్ హైస్కూల్‌కు దక్కిన అరుదైన గౌరవం**

**ఏటూరునాగారం, ఆగస్టు 29 (తెలంగాణ వాణి)** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో ఉన్న జేఆర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ అన్నీ మేరీ మాథ్యూ సాహిత్య రంగంలో తన ప్రతిభను చాటుకుంటూ జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ఆమె రచించిన 'సూరాజు' కవితకు నిర్వహించిన జాతీయ కవితా పోటీల్లో ప్రథమ బహుమతి లభించింది.సాహిత్య అకాడమీ పేరుతో జారీ చేసిన ప్రశంసాపత్రం ప్రకారం, 2026 ఏప్రిల్ 7న ఈ పురస్కారం అందించినట్లు పేర్కొంది. ప్రముఖ సాహిత్యవేత్తలతో కూడిన న్యాయనిర్ణేతల బృందం ఆమె కవితను ఎంపిక చేసినట్లు సర్టిఫికెట్‌లో ఉంది. విద్యా



రంగంలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే సాహిత్యంపై తనకున్న ఆసక్తిని కొనసాగిస్తూ 'హోప్' కవితతో జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడం విశేషంగా నిలిచింది. ఆమె సాధించిన ఈ ఘనతతో ఏటూరునాగారం జేఆర్ హైస్కూల్‌కు ప్రత్యేక గుర్తింపు లభించింది.అన్నీ మేరీ మాథ్యూ సాధించిన ఈ విజయంపై జేఆర్ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సాహిత్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు సృజనాత్మకత, సాహిత్యంపై ఆసక్తిని పెంపొందించడంలో ఆమె విజయం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఏటూరునాగారం ప్రాంతం నుంచి జాతీయ స్థాయి కవితా పోటీలో ప్రథమ బహుమతి సాధించడం పట్ల స్థానికులు సైతం గర్వం వ్యక్తం చేస్తున్నారు.

## మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ కృషి అభినందనీయం

**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 29 (తెలంగాణ వాణి)** : పీవీకే-5 ఇంక్లైన్ మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌కు మైనింగ్ స్టాఫ్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం పీవీకే-5 వద్ద జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు ఓవర్‌మెన్ ప్రమోషన్లు, అర్హులైన ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు, మెడికల్ ఇన్వాల్యుయేషన్ అయిన వారికి అర్హతకు అనుగుణంగా ఉద్యోగాలు కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించడం యూనియన్ పోరాట ఫలితమన్నారు. 2016-17 జేఎంఈటీ బ్యాచ్‌కు బ్యాక్‌డేట్‌తో ప్రమోషన్లు కల్పించడం చారిత్రాత్మకమన్నారు. భవిష్యత్తులోనూ ఏఐటీయూసీకి అండగా ఉంటామని తెలిపారు. అనంతరం మైనింగ్ స్టాఫ్ సమస్యలపై పోరాడిన హెడ్ ఓవర్‌మెన్ అనిల్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ సాయి పవన్ ఎద్దు అనిల్



చందులాల్ మురళీకృష్ణ ధీరజ్, గోవర్ధన్, గడప రాజయ్య ఏఐటీయూసీ పీవీకే 5ఇంక్లైన్ ఫిట్ సెక్రటరీ భూక్య రమేష్ సేఫ్టీ కమిటీ సభ్యులు రామచందర్ సొసైటీ సభ్యులు ఈర్ల కృష్ణ, వెంకట్ సురేందర్ రెడ్డి రామచందర్, నాగేంద్ర హరికృష్ణ శ్రీనివాస్ రెడ్డి రామారావు కృష్ణ పాల్గొన్నారు

## నాని 'ది ప్యారడైజ్' నుంచి క్రేజీ అప్‌డేట్.. 'యెష నాగుల' సాంగ్ వచ్చేది అప్పుడే!




టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని రెండో సింగిల్ డిజిటల్ లాంచ్‌కు రంగం సిద్ధమైంది. 'యెష నాగుల' అంటూ సాగే ఈ పాటను రేపు అధికారికంగా విడుదల చేయనుండగా.. దానికి ముందుగా ఈరోజు సాయంత్రం ఈ సాంగ్‌ను అనిరుధ్ కన్సర్ట్‌లో పాడబోతున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ పాటకు శ్యామ్ లిరిక్స్ అందించగా.. జంగి రెడ్డి, సందీప్ కుమార్ ఆలపించారు. అలాగే సందీప్ మాస్టర్ ఈ పాటకు కొరియోగ్రఫీ చేయడం విశేషం. ఇదిలా ఉంటే, ఈ చిత్రంలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలీ కులకర్ణి, సంపూర్ణేష్ బాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24, 2026న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ఖరారు చేశారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S) Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com